క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

షాద్‌నగర్: రైతు బీమాకు అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. 59 ఏళ్ల వయస్సు లోపు రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. 1965 నుంచి ఆగస్టు 14, 2006 సంవత్సరాల మధ్య పుట్టిన రైతులు బీమా పథకానికి ఆగస్టు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు జీరాక్స్ ప్రతులను తీసుకొచ్చి వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

షాద్‌నగర్‌కు అయోధ్య రాముడి ధనుర్బాణాలు

షాద్‌నగర్: అయోధ్య రామ మందిరంలో ప్రతిష్ఠించనున్న రామచంద్రుడి ధనుర్బాణాలు గురువారం షాద్‌నగర్‌కు చేరుకోనున్నాయి. శ్రీరామచంద్రమూర్తి భక్తుడు చల్లా శ్రీనివాసశాస్త్రి కిలో బంగారం, 13 కిలోల వెండితో తయారుచేసిన ధనుర్బాణాలను పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రదర్శించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో వచ్చి దనుర్బాణాలను సందర్శించి దర్శించుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న యూనియన్ సభ్యులు

షాద్‌నగర్: గత కొన్నిరోజులుగా అనారోగ్యానికి గురై మృతి చెందిన మెకానిక్ శివ కుటుంబ సభ్యులకు మెకానిక్ యూనియన్ సభ్యులు బుధవారం ఆర్థికసాయం అందజేసి చేయూతనందించారు. మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు రూ.1.20లక్షల ఆర్థికసాయానికి సంబంధించిన నగదును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, హర్షవర్ధన్‌రెడ్డి, జంగారెడ్డి, మధుగౌడ్, సునీల్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, శ్రీను, గణేశ్, ఇర్ఫాన్, ఉమర్, తరుణ్, సురేశ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, దామోదర్, రాజురెడ్డి, గోవింద్, మహేశ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



జన్వాడలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: మండలంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు కృషి చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జన్వాడ గ్రామంలో మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖాళీ స్థలాల్లో ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, పరిరక్షించాలని అధికారులను కోరారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

'ప్రశ్నించే గొంతులను అణిచివేసే ప్రయత్నం'

చేవెళ్ల: సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణిచివేసేందుకు ఈ ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అక్రమ అరెస్టులకు బీజేపీ నాయకులు భయపడరని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి జి.కావ్యకృష్ణగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం పోలీసులు బీజేపీ మహిళా మోర్చా అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వటంతో మహిళా మోర్చా నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా అరెస్ట్ చేసిన మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కావ్య మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలకు నిరసనగా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిందన్నారు. దీనిని అడ్డుకునేందుకు ఎక్కడికక్కడ మహిళా మోర్చా నాయకులను గృహ నిర్బంధాలు, అరెస్టులు చేశారన్నారు. అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమం ఆగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహిళల రక్షణపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఆమెతో పాటు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్ ఉన్నారు.

'భౌ'బోయ్



మొయినాబాద్‌లో రోడ్డుపై తిరుగుతున్న వీధికుక్కలు

గ్రామాల్లో వీధికుక్కల స్వైరవిహారం

- చిన్నారులు, పెద్దలు, మూగజీవాలపై దాడులు
- బయటకు రావాలంటేనే జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

మొయినాబాద్: మండలంలో వీధికుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కడ చూసినా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. పిల్లలు, పెద్దలు అనే తేడాలేకుండా దాడులకు తెగబడుతున్నాయి. గుంపులు గుంపులుగా ఒక్కచోట చేరి వాహనదారులను వెంబడిస్తూ భయపెడుతున్నాయి. గొర్రెల మందలపై దాడి చేసి చంపేస్తున్నాయి. వీధికుక్కల దాడులు రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

మండలంలోని అన్ని గ్రామాల్లో..

మొయినాబాద్ మండల కేంద్రంతోపాటు చిలుకూరు, పెద్దమంగళారం, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మేడిపల్లి, సురంగల్, అమ్డాపూర్, శ్రీరాంనగర్, కనకమామిడి, వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వీధికుక్కలు ఎక్కువయ్యాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ వచ్చిపోయే ద్విచక్రవాహనదారుల వెంబడి పడుతున్నాయి. దీంతో వాహనదారులు భయాందోళనకు గురై అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నారు. మరోవైపు వీధికుక్కలు గొర్రెలు, మేకల మందలపై దాడులు చేసి జీవాలను చంపేస్తున్నాయి. ఇటీవల కేతిరెడ్డిపల్లి, నాగిరెడ్డిగూడ, అమ్డాపూర్, సురంగల్ తదితర గ్రామాల్లో గొర్రెల మందలపై కుక్కలు దాడి చేసి వందల సంఖ్యలో జీవాల ప్రాణాలు తీశాయి. రోడ్లపై నడుచుకుంటే వెళ్లే వారిపై, చిన్నపిల్లలపై దాడి చేస్తున్నాయి. పదిరోజుల క్రితం మండలంలోని అమీర్‌గూడలో ఇంట్లో నుంచి బయటకు వచ్చిన మూడేళ్ల చిన్నారిపై వీధికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఇతర ప్రాంతాల్లో సైతం ఇటీవల వీధికుక్కల దాడిలో చిన్నారులు మృతి చెందిన సంఘటనలు చాలా ఉన్నాయి. ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



చిలుకూరులో వీధికుక్కల స్వైరవిహారం

నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో వీధి కుక్కలు ఎక్కువయ్యాయి. రోడ్లపైన, వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్నపిల్లలు ఇళ్ల నుంచి బయటకు వస్తే దాడి చేస్తున్నాయి. రోడ్లపై కుక్కల గుంపులు కనిపిస్తే వెళ్లడానికే భయమేస్తోంది. వీధికుక్కలను నియంత్రించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఫిరోజ్, మొయినాబాద్

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం



మొయినాబాద్ మండలం నగర శివారు ప్రాంతం కావడంతో నగరం నుంచి వీధికుక్కలు తీసుకొచ్చి ఇక్కడ వదిలేస్తున్నారని.. గ్రామాల్లో వీధికుక్కలు ఎక్కువయ్యాయని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి వీధికుక్కల బెడదను నివారించడానికి చర్యలు తీసుకుంటాం.

– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

నగరం నుంచి తెచ్చి గ్రామీణ ప్రాంతాల్లో..

హైదరాబాద్ నగరం నుంచి వీధికుక్కలు తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల్లో వదులుతున్నారు. దీంతో ఇటీవల కాలంలో గ్రామాల్లో వీధికుక్కలు ఎక్కువయ్యాయి. ఒక్కో గ్రామంలో సుమారు 100 నుంచి 200 వరకు వీధికుక్కలు ఉన్నాయి. కుక్కలు రోడ్లపై తిరుగుతుండడంతో వాహనదారులతో పాటు నడుచుకుంటూ వెళ్లేవారు సైతం భయంగా వెళ్లాల్సి వస్తోంది. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. రోజురోజుకు కుక్కలు పెరుగుతున్నా వాటిని నియంత్రించే చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని వీధి కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాల్లో వదిలేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్‌లో పోచమ్మ బోనాలు, బాకారంలో ఈరమ్మ బోనాల ఉత్సవాలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. బోనాల ఉత్సవాల్లో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

షాబాద్‌లో..

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి, పోతుగల్ గ్రామాల్లో బుధవారం బోనాలు ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు.

తంగడపల్లిలో..

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లిలో బుధవారం భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను నిర్వహించారు.

మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారం, మేడిపల్లి గ్రామాల్లో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.



అమ్డాపూర్‌లో బోనాల ఊరేగింపు



మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లిలో..



చేవెళ్ల: తంగడపల్లిలో..



మొయినాబాద్: పెద్దమంగళారంలో..

అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం



మొయినాబాద్‌రూరల్: కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు



చేవెళ్లలో కార్యదర్శులను, పాలకవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు, తదితరులు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని చిన్నమంగళారం మాజీ సర్పంచ్ నాగులపల్లి బాలమణిరాములు అన్నారు. మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలో బుధవారం బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి, కొత్తగా గ్రామానికి వస్తున్న కార్యదర్శికి పంచాయతీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాల పాటు పనిచేసిన మహేందర్‌కు వీడ్కోలు పలికి, కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శిని శివకుమార్‌ను స్వాగతించారు. కార్యక్రమంలో నాయకులు నాగులపల్లి రాములు, మాజీ సర్పంచ్ వాసుదేవ్, మాజీ ఎంపీటీసీ విజయయాదయ్య, వెంకటేశంగుప్తా, గోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులతో పాటు కార్యదర్శుల పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనదని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజఆగిరెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద బుధవారం చేవెళ్ల పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి బదిలీ కావటంతో వీడ్కోలు చెబుతూ కొత్తగా వచ్చిన కార్యదర్శి రాఘవేందర్‌కు స్వాగతం తెలిపి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వీరితోపాటు ఇటీవల పదవీ కాలం ముగిసిన ఎంపీటీసీలకు సైతం సన్మాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, మాజీ సర్పంచ్ వార్డు సభ్యులందరూ కలిసి సన్మానాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు దేవర సమత, మాజీ ఉపసర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బోనగిరి చౌరస్తాలో గలతెలంగాణ మోడల్ పాఠశాల వద్ద వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌తో కలిసి వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలకు కేటాయించిన లక్ష్యం మేరకు ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటుతూ ముందుకుసాగాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వీరాసింగ్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, ఖజామీయాపటేల్, రవీందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, మల్లేశ్, నాయకులు చేవెళ్ల స్వామి, సుభాశ్‌రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవేందర్, మాణిక్యం, శ్రీనివాస్, ఆంజనేయులు, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్‌నాయక్, గౌరీశ్వర్, హరికిషన్‌రెడ్డి, జానీ, బురాన్, దస్తగిరి, మహేశ్ ఉన్నారు.



మోడల్ స్కూల్ వద్ద మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

చేవెళ్ల: మండలంలోని చనువెళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–96 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం మండలంలోని ఓ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమకు చదువులు చెప్పిన పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 28 ఏళ్ల తరువాత కలుసుకోవటంతో చిన్ననాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింలు, ఎర్ర గోపాల్, జంగయ్య, నర్సింలు, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం లక్ష్మణ్‌నాయక్, మాజీసర్పంచ్ నర్సింలు

షాబాద్: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయ వృత్తి కీలక భూమిక పోషిస్తుందని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్‌నాయక్, గ్రామ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింలు పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న జంగయ్య, కృష్ణకుమార్, సుశీల, శివకుమార్, విజయలక్ష్మి, రవీందర్‌గౌడ్, కృష్ణయ్య, జాహింగీర్, ఎల్లయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

దశలవారీగా హామీలను అమలు చేస్తాం

పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రోనిగూడ గ్రామంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మల్లారెడ్డిగూడ నుంచి ఎర్రోనిగూడ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా మంత్రితో మాట్లాడి వెంటనే రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఎర్రోనిగూడ రోడ్డుకు నిధుల కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి వెంటనే మరమ్మతుల పనులు చేపడతామన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ముద్దెంగూడ మాజీ సర్పంచ్ సుదర్శన్, మాజీ ఉపసర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఖాజామీయా, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, మల్లేశ్, నాయకులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

పట్టణ సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, మొగిలిగిద్ద, కమ్మదనం గ్రామాలను సీఐ విజయ్‌కుమార్ సందర్శించి సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో వివిధ రాష్ట్రాల నుంచి పనిచేసేందుకు చాలా మంది కార్మికులు ఇక్కడికి వలస వస్తుంటారన్నారు. అయితే గ్రామాల్లో అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలను ఇళ్ల యజమానులు తీసుకోవాలని సూచించారు. ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో కావలి శ్రీశైలం, అన్మారి వెంకటయ్య, కక్కునూరి వెంకటేశ్ గుప్తా, బుడ్డ నర్సింహా, సాయిప్రసాద్ యాదవ్, యాదయ్య, మల్లేశ్, శ్రీపతిరెడ్డి, యాదయ్య, సెక్రటరీ తేజస్విని, లింగం, యాదయ్య, రాజు, నర్సింలు, రాజు, రమేశ్, చంద్రయ్య, కృష్ణయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎలికట్టలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రైతులకు ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ చేసిన సందర్భంగా మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రైతులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన మాటకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందరు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారని, రైతు వ్యతిరేక విధానాలు చేపట్టి వారిని కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. కుటుంబ పాలనను కొనసాగించి అన్ని వర్గాల ప్రజలను కేసీఆర్ మోసం చేశారన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కావలి శ్రీశైలం, బాల్‌రాజ్‌గౌడ్, బద్దుల మల్లయ్య, పెంటారెడ్డి, నారం రాంరెడ్డి, ఆర్ల యాదయ్య, చాకలి చంద్రయ్య, బుడ్డ నర్సింహా, శ్రీపాదరెడ్డి, ఆంజనేయులు, యూసుఫ్, దినేశ్‌రెడ్డి, యాదయ్య, జంగయ్య, రామరాజు, మల్లయ్య, ఆర్ల మహేశ్, శ్రీను, బాల్‌రాజ్, పిట్టల బోనయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం శివకుమార్ అన్నారు. బుధవారం గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ ప్రతినిధి సునీల్‌కుమార్ సహకారంతో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూ, బ్యాగ్స్, ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నర్సింలు ఉన్నారు.

Lost of Passport

I, Akhil Sai Kavuri S/o Venkateshwara Rao R/o H No:3-11, Rangapur Village, Nandigama Mandal, Ranga Reddy Dist.T.G., hereby declare that I have lost of my original Passport Bearing No S0703042 on 04-07-2024. While I was travelling from palamakula to Nandigama by RTC Bus. If anyone found please contact to me on: 9381489554

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు వన మహోత్సవంలో భాగంగా ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 28 గ్రామ పంచాయతీల కార్యదర్శులతో వన మహోత్సవ కార్యక్రమంపై ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో పాఠశాలల్లో ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, ప్రజలు వ్యవసాయ క్షేత్రాల్లోని ఖాళీ స్థలాలు ఎంచుకొని కనీసం ఒక గ్రామ పంచాయతీకి ఆరు వేల మొక్కలు నాటేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తారాబాయి, రంజిత్‌కుమార్, కవితకుమారి, రజిత, ఉమామహేశ్వరి, శివకుమార్, సంధ్యారాణి, సాయిజయదీప్, సుదర్శన్, శ్రీనివాస్, యాదగిరి, సురేందర్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

దేవాలయ కమిటీ చైర్మన్‌గా కృష్ణయ్య



ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న పాలకమండలి సభ్యులు, నాయకులు

కొందుర్గు: కొందుర్గు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా చేవెళ్ల కృష్ణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 24న దేవాలయ పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులుగా బాల్‌రాజ్, నర్సింలు, వేణుగోపాల్, మాధవరెడ్డి, అమరలింగం, అనితను నియమించారు. అదేవిధంగా దేవాలయ అర్చకుడు జంగం రాజేశ్‌ను ఎక్స్ అఫీషియో మెంబర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి చైర్మన్ కృష్ణయ్యతో పాటు సభ్యులను బుధవారం ఎండోమెంట్ ఈఓ శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎండోమెంట్ అధికారి మురళీకృష్ణ ప్రత్యేకాధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కావలి యాదయ్య, శ్రీశైలం, గోవర్ధన్, రామయ్యగౌడ్, గోపాల్, పెంటయ్య, లక్ష్మయ్యగౌడ్, మానయ్య, రామస్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

చెర్కుపల్లిలో..

మండలంలోని చెర్కుపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా జీవన్‌కుమార్ ఎన్నికైనట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా పాలకమండలి సభ్యులుగా సుశీల, యాదగిరి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి నియమితులైనట్లు ఆయన పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులను బుధవారం ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, యాదయ్య, కుమార్, రాజు, శశికుమార్, వెంకటేశ్, నర్సింలు పాల్గొన్నారు.

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

జి. మల్లికార్జున్ 9505507564